మినీకథ

# కళ్యాణ ఘడియ



— ఎన్. ప్రసూనాంబ

ఆఫీసు వర్కు కొంత మిగిలి వుంటే ఇంటికి తెచ్చుకుని పనిచేసుకుంటోంది కమల. సీరియస్‌గా వర్కు చేసుకుంటుంటే ఇంటావిడ వచ్చింది. ఆవిడ అలా వచ్చిందంటే కాఫీపొడి, పంచదార, చిల్లర డబ్బులు ఇలా ఏదో ఫకటి తిరిగి తీర్చవి అప్పుకొరకే వచ్చిందని గ్రహించింది కమల. అయినా తప్పదు ఇల్లుగలావిడ కదా! 'మర్యాదగా ఎం కావాలి రండి పిన్నిగారూ' అంటూ కుర్చీ చూపించింది.

'ఎంలేదమ్మాయ్. మా చెల్లెలు పిల్లలు ఇద్దరూ కాలేజి చదువులకొచ్చారు. వాళ్ళు ఈ వూళ్ళో చేరతారట. వేరే ఎక్కడో ఎందుకు మా ఇంట్లోనే వుంటే సరిపోతుంది గదాని ఇక్కడకే రమ్మన్నాను'.

'మంచి పని చేశారు పిన్నిగారూ' అంది కమల.

అందుకని మాకు ఈ నెలాఖరుకు ఈ గది ఖాళీ చేసియిచ్చెయ్యి. నువ్వు గది వెతుక్కోవాలని అనుకోకు, ఒక్కర్తివీ గది వెతుక్కుంటం శ్రమ కదా నీకు. అందుకే గది నేను చూసి వుంచాలే. మా పిన్నత్తగారింట్లో ముందు గది ఖాళీగా వుంది. నీకు వక్కర్తికీ సరిపోతుంది. ఎటొచ్చీ కాస్త ఆఫీసుకు, బజారుకు దూరం అంతే. నాతో వస్తే చూపించి మాట్లాడిపెడ్తా. ఆదివారం కదా! రా! బయలుదేరదాం! ఇంక నాల్గురోజులేగా ఫస్టువుంది'. అంటూ తొందర చేసింది ఇల్లుగలావిడ.

ఏం మాట్లాడాలో తెలీలేదు కమలకు.

తాను ఈ ఇంట్లో ఎలా చేరిందో గుర్తుకు వచ్చింది ఒకసారి. ఇదివరకున్న ఇంటి వాళ్ళ కొడుకు కోడలు వస్తున్నారని వాళ్ళు ఇల్లు చూపించి ఇక్కడ చేర్పించి వెళ్ళారు. అంతకు ముందు ఇంటివాళ్ళు వాళ్ళమ్మాయి మూడో పురుటికి వస్తోందని చెప్పి ఆ గది ఖాళీ చేయించారు.. అందుకే మూడో పురుడు అత్తారు చూసుకుంటానన్నారుట. చివరకు నెలలు నిండి వచ్చేసరికి మీరే తీసి కెళ్ళండి మీ అమ్మాయిని అని అన్నారని చెప్పి, అర్జంటుగా గది ఖాళీ చేయించారు. ఇలా ఎందుకు జరుగుతోంది. పురుళ్ళకు, జంటలు వస్తారంటేను, చుట్టాలు వస్తారంటేను ఇల్లు ఖాళీ చేయమని తేలిగ్గా అడగడానికి తను తలొగ్గడానికి కారణం తను వంటరిగా వుండటమేనా! అది తన తప్పా! ఒంటిగా వుంటేమాత్రం అద్దెఇవ్వట్లేదా! తనను అన్నట్లు ఒక సంసారం అంటూ వున్నవాళ్ళని అనగలరా! అంటే వాళ్ళు వెంటనే ఖాళీ చేస్తారా... అని ఆలోచిస్తుంటే......

'బయలుదేరమ్మాయి ఇల్లు చూపిస్తా' అంటూ తొందర చేయసాగింది ఇంటావిడ.

తప్పేదేముంది అనుకుంటూ వెళ్ళి అన్నీ సెటిల్ చేసుకుంది.

కొత్త ఇంట్లో చేరింది. నాల్గురోజులైంది.

ఇంతలో ఆఫీసులో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి కమలకు. కారణం విచారించగా తనకు బదులుగా వచ్చే అతనికి కొత్తగా పెళ్ళయిందట. అతని భార్య ఈ వూళ్ళోనే ప్రవేటు స్కూల్లో టీచరుట. ఆమెకు ట్రాన్స్‌ఫర్ వుండదు కనుక అతను ఇక్కడకు రిక్వెస్టుమీద తన ప్లేసులో వస్తున్నాడట. తనకు సంసారం బాదరబందీ లేదు కనుక తేలికగా వెడుతుందని తన ప్లేసుకు ట్రాన్స్‌ఫర్ పెట్టాడట.

ఇంక కళ్ళనీళ్ళ పర్యంతంఅయింది కమలకు. తాను వంటరిదని తన ఉద్యోగంతో కూడా ఆడుతున్నారు. ఇంతవరకు ఇళ్ళు మారటమే గాని వూళ్ళు మారలేదు. పోని ట్రై చేదామన్నా ఏమని కారణం చెప్పాలి.

ఆలోచించగా ఆలోచన వచ్చింది. వెంటనే పెళ్ళి నిశ్చయం చేయమని తల్లిదండ్రులకు వుత్తరం రాసిపడేసింది కమల. పెళ్ళంటే అసహ్యించుకునే కమల శ్రీమతి కావాలని కోరుకుంటోంది. ఉత్తరం చూసి తల్లిదండ్రులు ఇప్పటికి 'కల్యాణ ఘడియ' వచ్చింది కామోలు అని అనుకున్నారు.

*